ఉంది కాబట్టి ఆ లోకాలకు వెళితే ఆ భోగాలు అనుభవించవచ్చు అని నీకు అనిపిస్తోంది. పురాణాలు చదివి ఆ భోగాల మీద నీ మనస్సు వాలుతూ ఉంటే నీకు వైరాగ్యం లేదు అని అర్థం. భోగాల వలన పాపాలు వస్తాయి, భోగాల వలన రోగాలు వస్తాయి. మన దేశంలోనే కాదు, ప్రపంచంలో ఎక్కడ పాపం ఉన్నా, ఎక్కడ దోషం ఉన్నా వీటి అన్నింటికి 90 కారణాలు లేవు, అన్నింటికి రెండే కారణాలు ఉన్నాయి, అవే కామక్రోధాలు అన్నాడు జ్ఞానదేవుడు. నీకు ఆకర్షణ వద్దు, వికర్షణ వద్దు అంటున్నాడు జ్ఞానదేవుడు. నీకు ఆకర్షణ లేదు అనుకో, వికర్షణ లేదు అనుకో అప్పుడు నీకు సమానబుద్ధి వచ్చేస్తుంది. నీకు సమానబుద్ధి వచ్చినప్పుడు నీ బుద్ధి కంట్రోలులో మనస్సు ఉంటుందిగాని అది బయటకు వెళ్ళదు. నీ మనస్సు ఏ విషయాల మీదకు అయితే పరుగెడుతోందో ఆ విషయాలనుండి నీ మనస్సును వెనక్కి లాక్కో, అదే సాధన అని పరమాత్మ చెప్పాడు. కృష్ణభక్తుడు అయిన జ్ఞానదేవుడు ఏమి చెపుతున్నాడు అంటే నీకు ఆకర్షణ లేనప్పుడు, వికర్షణ లేనప్పుడు అసలు నీ మనస్సు బయటకే వెళ్ళదు కదా. అది బయటకు వెళితే దానిని వెనక్కి లాక్కోవటం గొడవ ఉంటుంది. అది బయటకు వెళ్ళాలి అంటే దానికి ఎక్కడైనా ఆకర్షణ ఉండాలి, వికర్షణ ఉండాలి. అవి రెండూ లేనప్పుడు ఇంక అది ఎందుకు బయటకు వెళుతుంది. మీరు ఇక్కడ గుర్తించవలసిన విషయం ఏమిటి అంటే మీ మనస్సులో భోగప్రవృత్తి ఉంటే ఆ భోగప్రవృత్తిని సాధన చేసి నెమ్మదిగా బయటకు తోలేయండి. మనస్సును అసహజమైన విషయాలలోనికి వెళ్ళనివ్వకండి, మనస్సును సహజంగా ఉంచండి.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 14-01-2011, చెరుకుమిల్లి)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

**త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రై గుణ్యో భవార్జున!**
**నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ (2-45)**

వేదం అంటే జ్ఞానం అని అర్థం. మనకి ఋగ్వేదం, యజుర్వేదం, అధర్వణవేదం, సామవేదం అని నాలుగు వేదాలు ఉన్నాయి. వేదంలో ఒక్క ఆత్మజ్ఞానం గురించేకాదు, భౌతిక జ్ఞానం గురించి కూడా చెప్పారు. వేదంలో ఉన్న మంత్రాలే పెళ్ళి మంత్రాలు చదువుతారు, శరీరాన్ని విడిచిపెట్టి జీవుడు వెళ్ళినప్పుడు అపరకర్మలు చేసినప్పుడు కూడా చదివే మంత్రాలు వేదంలో చెప్పారు అంతేకాకుండా ఇల్లు ఎలా కట్టుకోవాలి అనేటువంటి విషయాలు కూడా చెప్పారు. ఇలా వేదంలో చెప్పకుండా విడిచిపెట్టిన విషయం లేదు. వేదాలలో సత్త్వగుణం,

రజోగుణం, తమోగుణం గురించి చెప్పారు. ఏ గుణం యొక్క ప్రభావం ఎక్కువగా ఉన్నప్పుడు వాళ్ళ ప్రవర్తన ఎలా ఉంటుందో అది కూడా వేదంలో చెప్పారు. ఈ గుణాలన్నీ బంధించేవి అందుచేత నువ్వు ఆ గుణాలన్నీ దాటివెళ్ళిపో. భగవంతుడు ఈ మూడు గుణాలలో మాయపెట్టాడు. అందులో మంచిగుణం ఉండవచ్చు, చెడ్డగుణాలు ఉండవచ్చు. నువ్వు ఆ గుణాల గొడవలలోకి వెళ్ళకు. అవన్నీ మాయకు సంబంధించిన విషయాలు. అందులోంచి బయటకు వచ్చేయి, నువ్వు గుణాతీతుడవు అవ్వాలి. నువ్వు బ్రాహ్మీస్థితిని పొందాలి అని పరమాత్మ చెప్పాడు.

మన ప్రారబ్దాన్ని బట్టి మనకి దుఃఖం వస్తూ ఉంటుంది, సంతోషం వస్తూ ఉంటుంది నీకు సంతోషం వచ్చినప్పుడు పొంగిపోకు, ఏదైనా కష్టం వచ్చినప్పుడు కుంగిపోకు అలా నీ బ్రెయిన్‌ని ఎప్పటికప్పుడు బేలెన్స్ చేసుకుంటూ ఉండు. కారుకి డ్రైవరు ఎటువంటివాడో, మన శరీరానికి మన బుద్ధి డ్రైవరులాంటివాడు. డ్రైవరుని బట్టేకారు తోలడం జరుగుతుంది అలాగే మన బుద్ధిని బట్టే మన శరీరం నడుస్తూ ఉంటుంది. నువ్వు సంతోషం వచ్చినప్పుడు పొంగిపోకుండా, దుఃఖం వచ్చినప్పుడు కుంగిపోకుండా నువ్వు బేలెన్స్ చేసుకుంటూ ఉంటే నీ బుద్ధి పవిత్రమవుతుంది, నీ బుద్ధి ఏకాగ్రమవుతుంది. ఎడ్యుకేషన్ అంటే ప్రపంచములో ఉన్న విషయాలని సేకరించటంకాదు, ఎడ్యుకేషన్ అంటే నీ మనస్సుని పవిత్రం చెయ్యి, నీ మనస్సుని ఏకాగ్రం చెయ్యి అది అవసరం. నువ్వు పవిత్రుడవు అవ్వటం, నువ్వు ఏకాగ్రత సంపాదించటం ఇవి విద్యలో ముఖ్యమైన భాగాలు.

ధనాన్నిబట్టి, విద్యనిబట్టి, అధికారాన్నిబట్టి మనిషికి ఎంతోకొంత గర్వం ఉంటుంది. తాను కాని గొడవలతోటి వాడు తాదాత్మ్యం పొందుతాడు. చనిపోతే ధనానికి వాడికీ సంబంధం ఏముంది, ఏమీ సంబంధం లేదు. ఇలా కానివిషయాలతోటివాడు తాదాత్మ్యం పొంది అక్కడ నుంచి మళ్ళీ అహంకారం, గర్వం తెచ్చుకుంటాడు. నీకు డబ్బు ఉండవచ్చు కాని నువ్వు డబ్బు కాదు. ఇప్పుడు నీకు ఏదైనా అధికారం ఉండవచ్చు, కాని ఎప్పుడూ నువ్వు అధికారంలో ఉండవు కాలప్రవాహంలో అవి వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే గొడవల్ని పట్టుకొని నువ్వు పతనం అవ్వకు. నిర్ద్వంద్వో:- నీ జీవితంలో ద్వంద్వాలు వస్తూ ఉంటాయి. నువ్వు తట్టుకోవటం నేర్చుకో. తట్టుకోవటం నేర్చుకుంటే నువ్వు పవిత్రుడవు అవుతావు, నిర్మలుడవు అవుతావు, నీ బుద్ధి నిశ్చలముగా ఉంటుంది. నువ్వు ద్వంద్వాలు తట్టుకుంటూ ఉంటే నీ మనస్సు నీకు విరోధంగా ఉండదు,

నీ మనస్సు నీకు మిత్రుడిగానే ఉంటుంది. నీ మనస్సు నీకు మిత్రుడిగా ఉంటే నీ మనస్సు నీకు సేవ చేస్తుంది. నీ మనస్సు నీకు శత్రువుగా ఉంటే నీకు అపకారం చేస్తుంది. బయట వాళ్ళు నీపట్ల ఎలా ఉన్నారు అని కాదు ముందు నీ మనస్సుని నువ్వు స్వాధీనం చేసుకో, అది నీకు అనుకూలంగా ఉండేటట్టు చేసుకో అంటున్నాడు పరమాత్మ. నిత్యసత్త్వస్థ :- సత్యమైనది నిత్యంగా ఉంటుందికాని, సత్యముకానిది ఏదీ నిత్యముగా ఉండదు. నీ హృదయములో ఒక సత్యం ఉంది. ఆ వస్తువు నీకు చాలా క్లోజుగా, నియర్‌గా, డియర్‌గా ఉంది. అంతేకాదు అది నీవే. కానీ నీ రాంగ్ థింకింగ్ వలన, రాంగ్ ఐడెంటిఫికేషన్‌వల్ల అది నీవు అన్న సంగతి నీకు తెలియటంలేదు. నువ్వు సుఖపడాలి అంటే నీ హృదయంలో ఉండటం నేర్చుకో అప్పుడు నీ శరీరము, నీ ఇంద్రియాలు, నీ మనస్సు, నీ బుద్ధి అన్నీ నీకు స్వాధీనములోకి వస్తాయి. అప్పుడు నువ్వు సుఖపడతావు. నీ ఇంద్రియముల స్వాధీనములో, నీ మనస్సు స్వాధీనములో నువ్వు ఉంటే సుఖపడవు. అందుచేత వాటిని కంట్రోలు చేయటం నేర్చుకోవాలి, కంట్రోలు ఇచ్చే హేపీనెస్ మనకు కంఫర్ట్ ఇవ్వదు. అదే భగవాన్ చెబుతారు నీ హృదయంలో ఒక సద్వస్తువు ఉంది, దానితోటి నీకు జతచేయటం చేతనైతే చేసుకో, దానితోటి నీకు ఎలా స్నేహం చెయ్యాలో తెలియదు అనుకో బయట సత్‌పురుషులతోటి సహవాసం చెయ్యటం నేర్చుకో వాళ్ళ వైబ్రేషన్స్ నీ మీద పనిచేస్తూ ఉంటాయి అప్పుడు సద్వస్తువును తెలుసుకోవాలనే కాంక్ష నీకు వస్తుంది అంటున్నారు భగవాన్.

మన జీవితాన్ని మూడు భాగాలు చేస్తే ఒక భాగం నిద్రకు ఖర్చు అయిపోతుంది. ఇంకో భాగం మన పొట్టని పోషించుకోవటానికి ఖర్చు అయిపోతుంది. ఇంక మిగిలిన భాగం మన చేతిలో ఉంది, దానిని సద్వినియోగం చేసుకో. ఆ మూడవవంతు భాగంలో తెలివితక్కువ పనులు మానేసి తెలివైన పనులు చేస్తూ, చెడ్డ పనులు మానేసి మంచి పనులు చేస్తూ మనం బాగుపడేవిధానం చూసుకోవాలి. సత్కర్మలు చేస్తూ, భగవంతుడిని ఆరాధిస్తూ, సద్బుద్ధిని, సహృదయాన్ని ప్రసాదించమని భగవంతుడిని ప్రార్థిస్తూ కాలాన్ని నువ్వు సద్వినియోగం చేసుకో. కాలం మనకోసం ఆగదు. ఉన్న కాలాన్ని ఎవడైతే సద్వినియోగం చేసుకుంటున్నాడో వాడిని వివేకవంతుడు అంటారు. తెలివైన వాడికి, తెలివితక్కువ వాడికి తేడా ఏమిటి అంటే తెలివితక్కువ వాడికి కూడా అవకాశం వస్తుంది కానీ ఆ అవకాశాన్ని వదిలేస్తాడు, తెలివైనవాడు ఏమి చేస్తాడు అంటే వాడికి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాడు. అర్జునా కాలాన్ని సద్వినియోగం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి అన్నాడు

పరమాత్మ. నువ్వు అన్ని గుణాలకు అతీతంగా ఉండటం నేర్చుకో. నీకు పాత అలవాట్లను బట్టి ఆ గుణాలు వస్తూ ఉంటాయి. అలవాట్ల యొక్క వేగం తగ్గించుకోవటానికి ప్రయత్నం చెయ్యి.

గాయత్రీ మంత్రం అర్థం ఏమిటి అంటే నాకు సద్బుద్ధిని ప్రసాదించు, నాకు సహృదయాన్ని ప్రసాదించు. నువ్వు ఎలా ఎరుకలోకి వస్తావో అలా జీవించేవిధానం నాకు నేర్పు అని చెప్పారు. సద్బుద్ధిని ప్రసాదిస్తే అన్నీ మనచేతిలో ఉన్నట్టే. మన బుద్ధిని మనం బాగ చేసుకోవాలి. మన బుద్ధిని మనం బాగు చేసుకుంటే అది సత్యానికి వెళ్ళే దారి చూపిస్తుంది. మన మనస్సు, బుద్ధి పూర్తిగా అణిగిపోతే ఆ చైతన్యము నీకు అనుభవంలోనికి వస్తుంది కాని అది మన మైండుతోటి ఎంక్వయిరీ చేసేది కాదు. నీ మైండుకి అందటానికి నీ కంటే చిన్న వస్తువు ఏంకాదది. ముందు నీ మనస్సులో ఉన్న అలవాట్లు అన్నీ కాలిపోవాలి, దేహము నేను అనే బుద్ధి కూడా పోవాలి అప్పుడు లోపల ఉన్న చైతన్యం దానంతట అదే నీకు ఎరుకలోనికి వస్తుంది. అదే రీలైజేషన్ అంటే. జ్ఞానం అంటే ఏమిటి అని ఒకరు రామకృష్ణ పరమహంసగారిని అడిగారు. ఏదైతే నేను, నేను అని నువ్వు అనుకుంటున్నావో ఆ నేను, నేనుకాదని తెలుసుకోవటమే ఆత్మజ్ఞానం అన్నారు.

మనిషిలో ఉన్న బలహీనత ఏమిటో ఇక్కడ భగవంతుడు చెబుతున్నాడు. యోగం అంటే లేనిది సంపాదించటం. వచ్చింది పోకుండా సర్వవిధములా కాపలా కాసుకోవటం క్షేమం. ఈ రెండే ప్రతీమనిషి చేస్తాడు. ఎవడి యోగక్షేమాలు వాడు చూచుకుంటూ ఉంటాడు. నువ్వు సంపాదించటం, దాచుకోవటం మళ్ళీ ఉన్నది పోకుండా చూచుకోవటం అంటే 24 గంటలు అదే పనిలో ఉంటే నువ్వు సత్యాన్వేషణ ఎప్పుడు చేస్తావు. ఎవడైతే తన యోగక్షేమాలు వదిలేసాడో వాడి యోగక్షేమాలని భగవంతుడు చూసుకుంటాడు. కాని భగవంతుడు చూడడేమో అని నీకు భయం వేస్తుంది. అసలు భగవంతుడు ఉన్నాడనే నమ్మకం నీకు లేదు కదా. ఆయన ఉన్నాడనే నమ్మకం లేనప్పుడు నువ్వు భగవంతుడి మీద ఎలా ఆధారపడతావు. ఈ ప్రపంచాన్ని ఎవడైతే చూస్తున్నాడో వాడే నిన్ను కూడా చూస్తాడు. నీ యోగక్షేమాల గురించి నిరంతరం ఆలోచించుకుంటూ ఉంటే నీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది కాని అంతర్ముఖం అవ్వదు. 24 గంటలూ నీ యోగక్షేమాలు చూసుకుంటూ ఉంటే ఇంక నువ్వు ఆత్మవిచారణ ఎప్పుడు చేస్తావు, సత్యాన్వేషణ ఎప్పుడు చేస్తావు.

అంతఃకరణం అంటే లోపలఉన్న పనిముట్టు. ఆ పనిముట్టుని ఎప్పుడూ శుద్ధిగా

ఉంచుకోవాలి. నువ్వు శరీరాన్ని ఎలా శుద్ధిగా ఉంచుకుంటున్నావో అలాగే నీ బుద్ధిని కూడా శుద్ధిగా ఉంచుకోవాలి. నీ బుద్ధి శుద్ధిగా లేదు అనుకో నువ్వు జ్ఞాని అవ్వలేవు. కెరటం లేనప్పడు నీళ్ళు ఎంత నిర్మలంగా ఉంటాయో, ఎంత స్వచ్ఛముగా ఉంటాయో, అంత నిర్మలంగా, అంత స్వచ్ఛముగా నీ బుద్ధి ఉండాలి. అంత స్వచ్ఛముగా నీ బుద్ధి లేకపోతే నీ స్వరూపం నీకు తెలియదు. సుఖం అనేది, శాంతి అనేది నీ స్వరూపంలోనే ఉంది. నువ్వు పొందేది సుఖంకాదు, సంతోషాలు పొందుతున్నావు. ఈ రోజు నువ్వు సంతోషంగా ఉంటే ఈ సంతోషం అంతా పరిణామంలో దుఃఖం కింద మారిపోవచ్చు కాని నువ్వు జ్ఞానం సంపాదిస్తే నీ దుఃఖం అంతా సుఖంగా మారిపోతుంది. సుఖం అనేది నీ స్వరూపంలోనే ఉంది కాని బయట ప్రపంచంలో ఏ వస్తువులోను, ఏ పదార్ధంలోను సుఖమనేది లేదు. నీ అంతఃకరణాన్ని శుద్ధి చేసుకుని ఆత్మ సంపదని సంపాదించుకో అర్జునా అన్నాడు పరమాత్మ.

నీకు ఎటుచూసినా సుఖమే, ఎటుచూచినా శాంతే, ఎటుచూచినా ఆనందమే కలుగుతూ ఉంటే వాటికోసం ఇంక నువ్వు బయట విషయాల మీద ఆధారపడటమెందుకు? పంచదార ఫ్యాక్టరీ ఉన్నవాడు చిల్లరకొట్టుదగ్గరకు పంచదారకోసం తిరగటం ఎందుకు? నీకు ఎటుచూచినా మంచినీళ్ళు అందుతూ ఉంటే నువ్వు మంచి నీళ్ళ కోసం నుయ్యి చుట్టూ, కుళాయిల చుట్టూ తిరగటం ఎందుకు. జ్ఞానికి సుఖం, శాంతి, ఆనందం వాడి స్వరూపంలోంచే సప్లై అవుతుంది. ఇంక జ్ఞాని తన సుఖంకోసం ఇంద్రియాల మీదగాని, మనస్సుమీదగాని, విషయాలమీదగాని ఆధారపడనక్కరలేదు. జ్ఞాని యొక్క వైభవం అటువంటిది. నీ శరీరాన్ని విడిచిపెట్టి నువ్వు బయటకు వెళ్ళినప్పడు పుణ్యపాపాలు మోసుకువెళ్ళకు. పుణ్యమూ సంకెళ్ళే, పాపము సంకెళ్ళే రెండూ బంధిస్తాయి. పాపము వలన చెడ్డ జన్మ రావచ్చు, పుణ్యం వలన మంచి జన్మరావచ్చు. జన్మ వస్తే శరీరం వస్తుంది. శరీరం వస్తే ఇంక మనకు అన్నీ కష్టాలు, బాధలే కదా. నిద్దట్లోంచి మెలకువ వచ్చిన తరువాత నిద్దట్లో వచ్చిన గొడవలన్నీ ఎలా అబద్ధమని తెలుస్తాయో అలాగ నువ్వు పుణ్యం చేసినా, పాపం చేసినా నీకు స్వరూప జ్ఞానం కలిగితే అవన్నీ అబద్ధాలు అని తెలుస్తాయి. అక్కడకి నీ కళ్ళు తెరువు, నువ్వు జ్ఞానం కోసం తపించాలి అంటే దాని గురించి నువ్వు శ్రవణం చెయ్యాలి, దాని గురించి చదవాలి, నువ్వు జ్ఞానం గురించి వినగా, వినగా దాని వైభవం నీకు తెలుస్తుంది, దానిని సంపాదించాలనే బుద్ధి నీకు కలుగుతుంది. దాని వైభవం నీకు తెలియకపోతే సంపాదించాలనే బుద్ధి నీకు కలుగదు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| మార్చి | 2 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం (శివరాత్రి) |
| మార్చి | 6 | పాలమూరు |
| మార్చి | 19 | చించినాడ, గీతామందిరం |
| మార్చి | 30 | పోడూరు |
| ఏప్రియల్ | 6 | గుమ్మలూరు |
| ఏప్రియల్ | 12 | కొమ్మర శ్రీరామనవమి |
| ఏప్రియల్ | 17 | ముమ్మిడివరం మధ్యాహ్నం 2 గం॥లకు శ్రీ ఉమాసూరేశ్వరస్వామివారి కళ్యాణం నిమిత్తం |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha



అర్తమూరు గ్రామంలో కర్రి వెంకట భాస్కరరెడ్డిగారి
కుటుంబ సభ్యులు సద్గురు శ్రీ నాన్నగార్కి తులాభారం చేసినారు

# ప్రకృతిపై ఆసక్తి పెంచుకొంటే - అశాంతి వస్తుంది

పాప పుణ్యాలు దేహం ధరిస్తేనే గాని అనుభవానికి రావు. అందుకనే దేవుడు మనకు దేహాన్ని ఇచ్చాడు. శరీరంపై తగని వ్యామోహాన్ని కలుగజేసి 'నేను' అని మనచేత భ్రమింపజేసేటట్లు చేస్తాడు. భగవంతుడు శరీరాన్ని ఇచ్చి శిక్షింపచేస్తాడు. పాపం చెయ్యరాదనే 'స్మృతి' మనకు ఎప్పుడూ ఉంటుంది. కాని వాసనలు ఉన్నంతకాలం పాపాచణ నుంచి తప్పించుకోలేము. కేవలం గురు అనుగ్రహంతోనే దాన్ని దాటగలము. ఆసక్తి మనకు అన్యవిషయాలపైనే ఉంటుంది. ఇతరులనే 'మనముగా' చేసి వేస్తే ఆశ కలగదు. అంతా మనమే మనకంటే ఇతరులు లేరు కాబట్టి. ఆసక్తి లేని కారణంగా ప్రయత్నము లేదు మరో ఉపాయం 'ఈ దేహాలు అన్నీ నశించేవే' అనే స్ఫురణ మదిలో ఉంటే ఆసక్తి లేదు అది లేకపోతే ప్రయత్నము లేదు కాబట్టి పాపం లేదు. దేహం రాకపోతే దుఃఖం లేకుండా పోతుంది. అందంగా ఉంటే దాని కొరకు అర్రులతో చూస్తాము. అసలు రెండవది ఉంటేనే ఆసక్తి. మన లక్ష్యం సత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలి. మనకు నిత్యానిత్య వివేకం కావాలి. కోరికలను పెంపొందించే మహిమలు మనలను అజ్ఞానమనే మూఢ నమ్మకాల ఊబిలో దించేస్తుంది. గొప్ప గొప్ప మేధావులు గౌరవ ప్రతిష్టలో సుఖముందని భ్రమిస్తారు. చరిత్ర చూస్తే అటువంటివారే జైలు జీవితానికి గురి అయ్యారు. అవి అన్నీ అస్థిరాలు నాశనమయ్యేవి వాటిని ప్రేమిస్తే సుఖం ఎలా దొరుకుతుంది. అన్నీ కలిగి ఉన్నా వాటిమీద రక్తి కోల్పోవాలి. సాధన పేరుతో కొందరు గంగాతీరం, పుణ్యక్షేత్రాలకు పోయి వాటికి బానిసలు అవుతారు. సాధకుడు ధర్మ అర్థకామాల ఆవస్యకతలను విలువలను, పరిధిని, అవధిని, ప్రయోజనాన్ని గుర్తించి వాటి బంధనాల నుండి బయటపడాలి అప్పడే మోక్షశాంతి కలుగుతుంది. సాధకుడు కోరికలను శత్రువుగా భావించాలి. అవి మోహాన్ని పెంచుకోవటానికి కారణమౌతాయి. ఇలా సంసార చక్రంలోంచి బయటపడలేము. వైరాగ్యంతో శాంతంగా జీవించాలి. అసలు మనస్సే భ్రమకు జన్మస్థానం. దాన్ని గ్రహించి దానితో బేధించకుండా నియమించుకోవాలి అప్పడు సాధకుడు కాలాన్ని వృధా చేసుకోడు. మనం ప్రపంచ సుఖాలను అనుభవిస్తూ అదేకాలంలో పరమసత్యాన్ని గ్రహించలేము విషయసుఖాలు విషమని గ్రహించాలి. "ఏ రోజు జీవితం స్వప్నంగా తోస్తుందో వాడు ఏడిచేకారణం కనబడదు" అంటారు పెద్దలు. ముందు మన మనస్సును బాగుచేసుకొంటే శాంతి అదే వస్తుంది. శాంత చిత్తులే సత్యాన్ని దర్శిస్తారు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**